# ఋణభారం

- డి. కామేశ్వరి

ఆఫీసు నుంచి రాగానే కాఫీ కప్పుతో పాటు ఒక ఇన్‌లాండ్ లెటర్ తెచ్చి నా ముందు పడేసింది విసురుగా మా ఆవిడ. ఆవిడ విసురు చూడగానే రాసిందెవరో తెల్సినా, 'ఎవరి దగ్గర నించి ఉత్తరం' అన్నా యధాలాపంగా అన్నట్టు.

'ఇంకెవరు మీ ప్రియమైన అక్కగారి నుంచి మరో తాఖీదు పాతిక వేలని, యిక్కడ డబ్బుల చెట్లున్నాయనుకుంటుందో, పాతర్లున్నాయను కుంటుందో ఆవిడ. అయినా ఆవిడ్ని అని ఏం లాభం, యిచ్చేవాళ్లుంటే అడిగే వాళ్లదేం పాపం' రుసరుసలాడుతూ లోపలికి వెళ్లిపోయింది సుగుణ.

కాఫీ తాగి తాపీగా ఉత్తరం తీశా. పద్మకి పెళ్లి సంబంధం కుదిరింది. అబ్బాయికి బ్యాంకులో పని, పిల్ల నచ్చింది. పాతిక వేలు అడిగారు కట్నం అయితేనేం, లాంఛనాలయితేనేం! మరో పాతికేనా లేంది పెళ్లి కాదు గదా, పాతిక వేలు నీవు సర్దు, మిగతాది ఏదో తంటాలు పడ్తాను. దీని పెళ్లి అయిపోతే నా బాధ్యతలు తీరిపోతాయి, యింక నిన్ను యిబ్బంది పెట్టే ప్రసక్తి వుండదు. ఎలాగో ఏ లోనో పెట్టి నాకీ సాయం చేయాలి అని రాసింది.

ఏమా ఆవిడకే కాదు నాకూ చిరాకే అనిపించింది ఆ ఉత్తరం. నేనెక్కడ నుంచి తీసుకొస్తాను. యిప్పటికి మూడుసార్లు మూడు పాతికలు అయ్యాయి. లోను మాత్రం ఎంతకని యిస్తారు ఆఫీసు వాళ్లు, యిచ్చినా ఆ లోన్లు తీర్చడంలోనే నా బతుకు వెళ్లమారేట్టు వుంది. ఈసారి యింక నా వల్ల కాదు అని రాసేయాలి.

అక్కయ్య నాకోసం తన జీవితం ధారపోసింది. తల్లిలా పెంచింది. తల్లిలా ఏమిటి, తల్లే అయి పెంచింది. కనగానే అమ్మని పోగొట్టుకుని, రెండేళ్లయినా నిండక ముందే తండ్రిని పోగొట్టుకున్న తనకి తల్లి తండ్రి అయి అక్క బావ పెంచారు. అక్కకి తనకి పన్నెండేళ్లు తేడా. అక్క తరువాత రెండు కాన్పులయినా పిల్లలు దక్కలేదుట అమ్మకి. ఆఖరుగా తను పుట్టే వేళకి అక్కకి పన్నెండేళ్లు – పన్నెండేళ్ల పిల్ల సాయంతో తండ్రి తనని పెంచుకుంటూ వుంటే ఆ తండ్రీ లేకుండా ఏక్సిడెంటయి తండ్రి పోతే – మేనమామ అక్కకి పదమూడేళ్లకే ఓ స్కూలు మేష్టరుకిచ్చి పెళ్లి చేసి బాధ్యత దులిపేసుకున్నాడు. ఆవు వెంట దూడలా అక్క వెంట తాను వెళ్లే షరతు పెట్టాడు పెళ్లికి ముందే మేనమామ.

అంచేత తన బాధ్యత అక్కది బావది అయింది. తన బాధ్యతని వాళ్లెన్నడూ పాపం నిర్లక్ష్యం చేయలేదు. పెళ్లయిన మూడేళ్లకి అక్కకి పెద్ద కూతురు పుట్టేవరకు ఆ యింటి మొదటి బిడ్డ తనే అనుకున్నారు యిద్దరూ. కలోగంజో వాళ్లతో పాటే! వీలున్నంత వరకు చదివించారు. పల్లెలో వున్న రెండెకరాలు తనని ఎం.కామ్ చదివించడానికి సరిపోయింది. బ్యాంక్ పరీక్ష రాసి బ్యాంకులో ఉద్యోగం సంపాదించుకున్నాడు. మంచి సంబంధం చూసి పెళ్లి చేసి వాళ్ల బాధ్యత తీర్చుకున్నారు. తను పెద్దయ్యే వేళకి అక్కకి ముగ్గురాడపిల్లలు, ఒక మగ పిల్లవాడు పుట్టారు. ఇద్దరు కూతుళ్ళ తరువాత కొడుకు– కొడుక్కి సరిగా చదువబ్బలేదు. కూతుళ్ళని ఇంటర్ దాకా చదివించి మాన్పించింది. అంతకంటే చదివిస్తే మొగుళ్ళని తేవద్దూ అంటూ. తను ఉద్యోగంలో చేరిన ఏడాదికి అక్క పెద్ద కూతురు పెళ్ళీడుకొచ్చింది.

అక్క బావలకయితే మనసులో చాలా వుండేది, కూతురిని తనకిచ్చి చేయాలని. కాని చిన్నప్పటి నుంచి చేతులతో ఎత్తుకుని ఆడించిన పిల్లని అన్నలా తప్ప దాన్ని మరోలా చూడలేదెప్పుడూ!. నా చెల్లెలనే అనుకున్నాడు తప్ప మేనకోడలని అనుకోలేదు. భార్యగా చూడడం నా వల్ల కాదని చెపితే కోపమే వచ్చింది. అక్క బావ అలిగారు. వాళ్లద్దరి కోపం పోగొట్టి శారద పెళ్లి నా బాధ్యత అని పెళ్లి ఖర్చు నాది అని చెప్పి వాళ్లని ఒప్పించేసరికి తాతలు దిగి వచ్చారు. ఈలోగా

నా పెళ్లి జరగడం, అప్పుడూ కాస్త నాకు ఖర్చు వదలక తప్పలేదు. ఈలోగా బావగారు రిటైరయ్యారు. ఇంట్లో అరడజను ట్యూషన్లు, పెన్షనుతో ఏదో విధంగా వాళ్ల బతుకులు వాళ్లు బతుకుతున్నా, రెండో కూతురి పెళ్లికి కట్నం మాట దేముడెరుగు - పెళ్లి ఖర్చులకి ఓ పది వేలన్నా లేని పరిస్థితి వచ్చి పడింది. అప్పుడూ అక్కయ్య పాతిక వేలడిగితే మరోసారి కాదన లేని స్థితి. యింట్లో సుగుణ సాధింపు - ఎంత పెంచి పెద్ద చేసినా యిలా తన దగ్గర వేలున్నట్టు అక్కయ్య అడగడం తనకీ మనసులో చికాకు అనిపించినా గట్టిగా కాదనలేక, అక్కయ్యను ఆ పరిస్థితిలో ఆదుకునే వారెవరూ లేరని అర్థం చేసుకుని మళ్లీ ప్రావిడెంట్ ఫండ్‌లోంచి అప్పు తీసుకున్నాడు - మొత్తానికి కూతుళ్ళిద్దరి పెళ్లి చేసింది.

ఈలోగా కొడుకు ఇంటర్ రెండు సార్లు తప్పి యింక చదవనని, డబ్బిస్తే ఏదన్నా బిజినెస్ చేస్తానని కూర్చున్నాడు. ఈ సారి సుగుణకే కాదు. నాకూ చిరాకు, కోపం వచ్చింది. ఏమిటి అక్కయ్య ఉద్దేశం, తన దగ్గిరేం డబ్బు చెట్టుందని అడుగుతుందా. 'యింటి మీద అప్పు తెచ్చుకోమనండి - యిక్కడెవరూ రాసులు పోసుకు కూర్చోలేదని ఖచ్చితంగా రాయండి - పంపిస్తే మాత్రం వూరుకోను. పిల్లల స్కూలు ఫీజులూ అవీ ఎంతెంత అవుతున్నాయో తెలీదా- మీరు తెచ్చిన అప్పులకే నెలకి రెండు వేలు జీతం కట్ అవుతుందని మర్చిపోకండి. సుగుణ చాలా తీవ్రంగా అయిష్టత తెలియజేసింది.

నిజమే, యింటి మీద అప్పు తీసుకోవచ్చుగా! తనకెందుకు తట్టలేదు ఆలోచన. ఎంత పాత యిల్లయినా, పెంకుటిల్లు అయినా ఓ పాతిక వేలు ఎందుకివ్వరు అప్పు అనిపించి ఆ మాటే రాసాను. తన అశక్తత తెలియచేస్తూ యింటి మీద అప్పు తెచ్చుకోమని సలహా రాశాను. ఎలా తెచ్చుకోవచ్చో బ్యాంకు ప్రొసీజరు, అప్లికేషన్ ఫారాలని పంపి సలహా యిస్తూ చేతులు దులిపేసుకున్నాను. అప్పు దొరక్కపోతే ఆ యిల్లు అమ్మిపారేయి అని ఉచిత సలహా యిచ్చాను.

అక్కయ్య దగ్గర నుంచి ఓ నెల రోజులు ఏం ఉత్తరం లేదు. నెల తరువాతే శుభలేఖ, పెళ్లికి రావాలంటూ ఉత్తరం వచ్చింది.

పెళ్లి అయిందనిపించినట్టు జరిగింది. అక్క బావ బాధ్యతలు తీరిపోయినందుకు ఆనందం కల్గింది. డబ్బు మాట అక్క ఏమీ ఎత్తలేదు. తనెత్తనప్పుడు నేనెందుకు కెలకడం డబ్బివ్వనప్పుడు అని వూరుకున్నాను. అలా అని అక్కయ్య కోపం తెచ్చుకున్నట్టే కనపడలేదు. కొడుకు చేత జిరాక్స్ మిషన్ పెట్టించింది. వాళ్ల జీవితాలకింక ఢోకా లేదనిపించి నిశ్చింత కల్గింది.

రెండేళ్లు గడిచాయి. నా సంసార బాధ్యత పెరగడం, ట్రాన్స్‌ఫర్లు... అక్కయ్యని కలవడమే కుదరలేదు. అక్కయ్యకి షుగర్, బి.పి.లు వచ్చాయి. మనిషి నీరసించింది. ఆరోగ్యం సరిగా లేదని బావ గారి దగ్గర నించి ఉత్తరం వస్తే ఈ మాటు పిల్లలకి సెలవులు వచ్చినప్పుడు వెళ్లాలనుకున్నాను. కాని ఈలోగానే బావగారినించి ఫోను. అక్కయ్య పరిస్థితి బాగులేకపోతే ఆస్పత్రిలో జాయిన్ చేసినట్టు, అక్కయ్య చూడాలని వుందన్నట్టు అంటుందని రమ్మని రాశారు. రెండు రోజులు సెలవు పెట్టి వెళ్లాలనే లోపలే అక్కయ్య పోయినట్టు ఫోను. ఆఖరి చూపుకి నోచుకోకపోయినందుకు బాధపడ్తూ బయలుదేరాను. కర్మకాండ పూర్తి అయ్యాక

## 'ఎక్కడ కొట్టాలో తెలుసుకోవడం'

ఒక పెద్ద ఫ్యాక్టరీలో ఆకస్మాత్తుగా మెషిన్ ఆగిపోయి పని చేయడం మానేసింది. రిపేరు చేసే వానిని పిలుచుకు వచ్చారు. అతడు మెషిన్ మీద సుత్తితో ఒక దెబ్బ వేశాడు. వెంటనే మెషిన్ పనిచేయడం ప్రారంభించింది. అతడు రూ.500/-లకు బిల్లు ఇస్తే, మేనేజర్ ఒకసారి సుత్తితో కొట్టినందుకు అంత పెద్ద బిల్లా అని ఆశ్చర్యపడి బిల్లును దేనికి ఎంతైందో విడివిడిగా వ్రాసి ఇమ్మన్నాడు. సుత్తితో ఒకసారి కొట్టినందుకు ఒక రూపాయి, ఎక్కడ కొట్టాలో తెలుసుకోడానికి రూ.499/-లు అని అతడు బిల్లు రాసి ఇచ్చాడు.

- వై.కె. మూర్తి



బావగారు ఓ పెద్ద దళసరి కవరు చేతికిచ్చి చదువు అన్నారు. ఏమిటి? 'చదువు నీకే తెలుస్తుంది. నీకు ఉత్తరం రాసి పంపేలోగానే ఆస్పత్రి పాలయింది. పిలిచి మాట్లాడాలనుకుంది' ఉత్తరం విప్పాను.

తమ్ముడూ - నీవు తమ్ముడివైనా నిన్నెప్పుడూ కొడుకుగానే భావించాను. రెండేళ్ల వయసు నించి కన్నతల్లిలాగే సాకాను. పెంచిన ప్రేమ గొప్పది నాయనా! నీవు బాగుండాలి, చల్లగా వుండాలనే ఎప్పుడూ కోరుకున్నాను. నాన్న బతికుండగా, చనిపోయే ముందు - తల్లీ నీవే వాడిని ఓ దరికి చేర్చాలి, నీవే వాడికి అమ్మవి. వున్న రెండెకరాలలో ఒక ఎకరం వాడి చదువుకి, రెండో ఎకరం నీ పెళ్లికి అమ్మి ఖర్చు పెట్టండి. ఈ పాత కొంపకి ఎంతొస్తే అంత ఇద్దరూ చెరి సగం తీసుకోండి. ఆడపిల్లవయినా సగభాగం నీది, వాడి భారం నీది అంటూ కన్నుమూశారు. ఏక్సిడెంట్‌లో పోవడంతో విల్లు రాసే టైము లేక ఆఖరు క్షణంలో చెప్పిన మాటలివి. నేనే నాడూ ఆస్తి ప్రస్తావన నీదగ్గర తేలేదు - నా పెళ్లి మామయ్య చేశాడు కాబట్టి ఎకరం భూమి అమ్మలేదు. నిన్ను బి.కాం.తో

ఆపేద్దామంటే ఏం ఉద్యోగాలొస్తాయి గుమస్తా తప్ప ఎం.కామ్. చదువుతానంటే ఆ రెండెకరాలు అమ్మి నీ చదువుకే ఖర్చు పెట్టాను. ఆ రోజు మీ బావగారు అందులో సగం మనది కదా అనైనా అనలేదు. నా డబ్బు నీ కోసం ఎందుకు ఖర్చు చెయ్యడం అని నేననుకోలేదు. అప్పటికి నాకూ నలుగురు పిల్లలున్నారు. డబ్బంటే చేదు కాదు నాకు, కాని నీవు బాగుపడాలి పైకి రావాలన్నదే నా ఆలోచన. నాకేదన్నా అవసరం వస్తే నా పెద్దకొడుకుగా నువ్వు ఆదుకుంటావన్న ఆలోచన నాది!

ఈ ఇంటి ప్రసక్తి నేను నీ దగ్గర తేలేదు. ఎందుకంటే ఒకటి నా స్వార్థం. రెండు నీకు తెలిస్తే యీ పాత కొంప అమ్మేసి పంచుకుందాం అంటావేమో! వుండేందుకు మాకు కొంపేనా వుండదు అన్నది నా స్వార్థం. ఇదమ్మితే ఎంతొస్తుంది. ఇద్దరు పంచుకుంటే వచ్చేదెంత, చూద్దాం. అవసరం వచ్చినప్పుడు నీకు చెప్పచ్చులే అని నీదగ్గర అనకపోబట్టి ఈనాడు ఈకొంప మనకు అదృష్టాన్ని తెచ్చి పెట్టబోతోంది. ఈ ఇల్లు నాన్నది అని నీకు తెలియదు కాబట్టి మిగిలింది ఈ యిల్లు మాదే అనుకున్నావు అందుకే నేను డబ్బు కోసం రాసినప్పుడల్లా ఇంటి మీద అప్పు తెచ్చుకోండి, అమ్ముకోండి అంటూ ఆఖరు సారి కోపంగా రాసావు. నాయనా నీకు నాకు రక్తసంబంధం కనుక నా మీద అభిమానం వుండొచ్చు. నేడబ్బడిగినప్పుడల్లా ముల్లె దాచిపెట్టినట్టు అడుగుతుందే ఈవిడ అని మీ ఆవిడ అనుకునే వుంటుంది. బాబూ భాస్కర్! నిన్నంత స్వతంత్రంగా డబ్బు సర్దమని ఎందు కడిగాననుకున్నావు. నిన్ను పెంచినందుకు చార్జీలు వసూలు చెయ్యాలని కాదు. ఆస్తిలో సగం హక్కు నాన్నిచ్చారు కనుక సాయంగా నీ దగ్గర తీసుకున్న డబ్బు యిల్లమ్ముకున్నప్పుడు యిచ్చిపుచ్చుకోడాలలో సర్దుబాటు చేసుకోవచ్చు అన్న ఆలోచన ఆ స్వాతంత్ర్యాన్ని నాకిచ్చింది. ఈ ఇల్లు నీది, నీకూ వాటా వుంది అని తెలిస్తే నిన్నడిగినప్పుడు అమ్మిపారేయి ఈడొక్కు కొంప అనేవాడివి. అమ్మితే ఏనాడో ఆ డబ్బు హారతి కర్పూరం అయ్యేది. అందుకే ఈ విషయం దాచాను.

ఇప్పుడు ఈ అపార్ట్‌మెంట్ల సంస్కృతి వచ్చాక మన అదృష్టం పండింది. ఈ ఏడొందల ఏభై గజాల స్థలంలో ఫ్లాట్‌లు కడతానని ఎవరో బిల్డరు వచ్చాడు. మొత్తం పన్నెండు కట్టి మనిద్దరికి చెరో రెండు ఫ్లాట్లు యిచ్చి చెరో లక్ష యిస్తానన్నాడు. మిగతావి అతను అమ్ముకుంటాడు. యిల్లు అమ్మకుండా దాచినందువల్ల మనం ఈనాడు ఇంత ఆస్తి చేసుకోగలిగాం. తమ్ముడూ, నే కావాలంటే నిన్ను అన్యాయం చెయ్యొచ్చు. ఈ యిల్లు నాన్నదని తెలిసిన మామయ్య ఎప్పుడో పోయాడు. దస్తావేజులు నా పేరు మీద నీ చిన్నప్పుడే నా ఎకరా పొలం బదులు యిచ్చినట్టు మార్పించుకోవచ్చు. చెయ్యాలంటే మోసం చేయొచ్చు. కాని నేను తల్లినిరా నీకు, ఏ తల్లీ బిడ్డకి అన్యాయం చేయదు. నీవు ఆఖరిసారి డబ్బు అడిగినప్పుడు చాలా పరుషంగా రాశావు. మనసుకి కష్టం అనిపించింది. నీ దగ్గర తీసుకున్న మొత్తం డబ్బు బిల్డరు యిచ్చే క్యాష్‌లో నీకు యిచ్చేస్తాను. నీ రెండు అపార్ట్‌మెంటులు నీ యిళ్ళు. వుంచుకున్నా అమ్ముకున్నా నీ యిష్టం. ఈ విషయాలు మాట్లాడాలి. నా ఆరోగ్యం సరిగా లేదు. ఓసారి వచ్చి సంతకాలు చేసి నీవూ బిల్డరుతో మాట్లాడుకో"…. అక్కయ్య–

అక్కయ్య పోయినప్పుడు కంటే ఉత్తరం చదువుతుంటే, కన్నీళ్లు చెంపలంబడి జారి, కళ్లు చదవలేకపోయాయి ఉత్తరాన్ని. "మీ అక్కయ్య ఎప్పుడూ వాడికో యిల్లుండాలి అండీ, యీ యిల్లు కాస్తా యిప్పుడమ్మితే ఏం వస్తుంది. ధరలు పెరిగాక చూద్దాం అనేది – ఎప్పుడు డబ్బవసరం వచ్చి నేను అమ్మేద్దాం అంటే! ఆవిడది తల్లి మనసయ్యా – నీవు విసుక్కున్నా నిన్నడగడానికి ఆవిడేనాడూ మొహమాటపడలేదు. కొడుకు నడగడానికి నాకేం సిగ్గు అనేది" బావ కళ్లు తుడుచుకుంటూ అన్నారు. ఉత్తరం, కాయితాలు పట్టుకుని గదిలోకి వెళ్లి సుగుణ మీద విసిరేసి మంచానికి అడ్డం పడ్డాను. కన్నీళ్లతో తలగడ తడిసిపోసాగింది. అక్కయ్య ఋణభారం తీర్చలేదు – పెంచిపోయింది అనిపించింది. ○